నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

మంగళవారం 17 అక్టోబర్ 2023 | TUESDAY, OCTOBER 17, 2023 | RANGAREDDY | పేజీలు : 12 PAGES



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభ్యర్థులకు ప్రగతి భవన్‌లో బీఫామ్‌లను అందజేసిన సీఎం కేసీఆర్

# విజేతలై తిరిగిరండి

**ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు బీఫామ్‌లు అందజేసిన సీఎం కేసీఆర్**

- మ్యానిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వివరించండి
- మంత్రి సబితారెడ్డి, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, పరిగి, వికారాబాద్ అభ్యర్థులకు బీఫామ్‌లు ఇచ్చి పలు సూచనలు సలహాలనిచ్చిన సీఎం కేసీఆర్
- మరింత హోరందుకోనున్న ప్రచారం

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ అభ్యర్థులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రగతిభవన్‌లో బీఫామ్‌లు అందజేశారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పరిగి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బీఫామ్‌లు అందుకున్న వారిలో ఉన్నారు. ఆదివారం బీఫామ్‌లు అందుకోవాల్సి ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల వీరు సోమవారం తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారని సమాచారం. కష్టపడి పని చేసి విజయంతో తిరిగి రావాలని ఆశీర్వదించినట్లు తెలిసింది. అలాగే, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నట్లు సమాచారం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అన్ని సీట్లను బీఆర్ఎస్ అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేయాలని వారికి చెప్పినట్లు తెలిసింది. బీఫామ్‌లు అందుకున్న వెంటనే అభ్యర్థులు వారివారి నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ప్రారంభించారు.



బైర్‌ఖాన్‌పల్లి గ్రామంలో వై. అంజయ్యయాదవ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు


# పండుగలా ప్రచారం

- రంగారెడ్డి జిల్లాలో ప్రచారాన్ని షురూ చేసిన గులాబీ దళం
- గడపగడపకూ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరణ
- మళ్లీ ఆశీర్వదిస్తే అండగా ఉంటామని ప్రజలకు భరోసానిచ్చిన ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్యయాదవ్
- ఓ వైపు పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలు.. మరోవైపు విస్తృతస్థాయి సమావేశాలతో బిజీబిజీ
- ఊరూరా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపైనే జనం చర్చ
- బీఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న వలసల పర్వం
- కాలనీల అసోసియేషన్లు, కుల సంఘాల నుంచి వెల్లువలా మద్దతు

8

ఎన్నికల రణరంగంలో గులాబీ దళం దూసుకెళ్తున్నది. సోమవారం రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచార జోరును పెంచారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్మాస్‌పల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని షురూ చేశారు. జమ్మలబాయి తండా, పూల్లేరుబోడు తండా, పోచమ్మగడ్డ తండా, గానుగుమర్ల తండా, కానుగుబాయి తండాల్లో విస్తృతంగా పర్యటించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం బైర్‌ఖాన్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల్లో మహిళలు బోనాలతో స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టగా, డప్పు కళాకారుల ప్రదర్శనలు.. ర్యాలీలతో ప్రచారం హోరెత్తింది. గడపగడపకూ వెళ్లి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కొత్త మ్యానిఫెస్టో అమలుతో కలిగే ప్రయోజనాలను తెలుపుతున్నారు. మళ్లీ ఆశీర్వదిస్తే అండగా ఉంటామని భరోసానిస్తున్నారు. బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టాలని ఓటర్లను అభ్యర్థించారు. ఓ వైపు పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలు.. మరోవైపు విస్తృతస్థాయి సమావేశాలతో అభ్యర్థులు రోజంతా బిజీబిజీగా గడిపారు. కాలనీల అసోసియేషన్లు, కుల సంఘాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుండగా.. బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతున్నది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో మంత్రి సబితారెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, శంకర్‌పల్లి మండలం బుల్కాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యల సమక్షంలో వివిధ పార్టీలవారు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఏ ఊరికెళ్లినా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపైనే జనం చర్చించుకుంటూ జేజేలు పలుకుతుండడం గమనార్హం.

– రంగారెడ్డి, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ)



కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు హారతిస్తున్న మహిళలు



డప్పు చప్పుళ్లతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు స్వాగతం పలుకుతున్న బైర్‌ఖాన్‌పల్లి గ్రామస్తులు

**మన కోసం మ్యానిఫెస్టో**

# ఆరోగ్యానికి.. అందలం

**మ్యానిఫెస్టోలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు ప్రకటనపై హర్షాతిరేకాలు**

**రూ.15లక్షల వరకు పెంచుతామని సీఎం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో సంబురాలు**

**తొమ్మిదేండ్లలో వైద్యరంగంలో అద్భుతాలు సృష్టించారని ప్రశంసలు**

**మళ్లీ 'కేసీఆరే మా సీఎం'.. అని నినదిస్తున్న జనం**

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు తొమ్మిదేండ్ల క్రితం ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితి కేవలం రూ.2 లక్షలు మాత్రమే ఉన్న విషయం విదితమే. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచారు. తరువాత రూ.10 లక్షలకు పెంచడం జరిగింది. తాజాగా మ్యానిఫెస్టోలో ఈ పరిధిని రూ.15 లక్షలకు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఒకపక్క ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం, హైదరాబాద్‌కు అన్ని వైపులా సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రానుండడంతో వైద్యరంగంలో అనేక అద్భుతాలు చోటుచేసుకోబోతున్నాయని బీఆర్ఎస్ పనితీరును ప్రజలు ప్రశంసిస్తున్నారు. 'మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపిస్తామని.. కేసీఆరే మా సీఎం' అని జనం నినదిస్తున్నారు..

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



7